Telugu Bhakti Pages

www.telugubhakti.com

Printer friendly version

Join Telugu Bhakti Pages group to get updates/ to participate in Dharmic discussions and to share thrilling religious views and divine experiences.

Click http://groups.yahoo.com/group/TeluguBhaktiPages/

॥ఓం శ్రీపరమాత్మనే నమః॥

# శ్రీ త్యాగరాజస్వామి కీర్తనలు

## ఘనరాగ పంచరత్నములు

1

**నాటరాగము** **ఆదితాళము**

ప. జగదానందకారక జయ జానకీ ప్రాణనాయక ॥జ॥

అ.ప. గగనాధిపసత్కులజ రాజరాజేశ్వర
సుగుణాకర సురసేవ్య భవ్యదాయక సదా సకల ॥జ॥

చ.1. అమర తారక నిచయ కుముదహిత పరిపూర్ణానఘ
సురసురభూజ దధిపయోధి వాసహరణ
సుందరతరవదన సుధామయవచోబృంద గోవింద
సానంద మావరాజరాప్త శుభకరానేక ॥జ॥

2. నిగమనీరజామృతజ పోషకానిమిషవైరి
వారిదసమీరణ ఖగతురంగ సత్కవిహృదాలయ
అగణిత వానరాధిప నతాంఘ్రియుగ ॥జ॥

3. ఇంద్రనీలమణి సన్నిభాపఘన
చంద్రసూర్యనయనాప్రమేయ వా
గీంద్రజనక సకలేశ శుభ్ర నా
గేంద్రశయన శమనవైరి సన్నుత ॥జ॥

4. పాద విజిత మౌనిశాప సవ పరి -
పాల వరమంత్రగ్రహణలోల
పరమశాంతచిత్త జనకజాధిప
సరోజభవ వరదాఖిల ॥జ॥

5. సృష్టిస్థిత్యంత కారక అమిత -
కామిత ఫలద అసమానగాత్ర

శచీపతిసుతాబ్ధిమదహర
అనురాగ రాగరంజిత కథాసారహిత ॥జ॥

6. సజ్జన మానసాబ్ధిసుధాకర
కుసుమ విమాన సురసారిపు కరాబ్జ
లాలిత చరణ అవగుణాసుర -
గణమదహరణ సనాతనాజనుత ॥జ॥

7. ఓంకార పంజరకీర పురహర
సరోజ భవ కేశవాది రూప
వాసవ రిపు జనకాంతక కలాధర
కలాధరాప్త ఘృణాకర
శరణాగత జనపాలన సుమనోరమణ
నిర్వికార నిగమ సారతర ॥జ॥

8. కరధృత శరజాలాసుర మదాపహరణావనీసుర సురావన కవీన బిలజ మౌనికృత
చరిత్ర సన్నుత శ్రీ త్యాగరాజ సన్నుత ॥జ॥

9. పురాణపురుష స్వవరాత్మజాశ్రిత -
పరాధీన ఖరవిరాధరావణ
విరావణ అనఘ పరాశర మనో -
హరావికృత త్యాగరాజసన్నుత ॥జ॥

10. పురాణపురుష స్వవరాత్మజాశ్రిత -
పరాధీన ఖరవిరాధరావణ
విరావణ అనఘ పరాశర మనో -
హరావికృత త్యాగరాజసన్నుత ॥జ॥

11. అగణితగుణ కనక చేల సాలవిదళన
అరుణాభ సమానచరణ
అపారమహిమాద్భుత సుకవిజన -
హృత్సదన సురమునిగణ విహిత
కలశనీరనిధిజారమణ పాపగజనృసింహ
వరత్యాగ రాజాదినుత ॥జ॥

2

## గౌళ రాగము ఆదితాళము

ప. దుడుకుగల నన్నేదొరకొడుకు బ్రోచురా ఎంతో ॥దు॥

అ.ప. కడుదుర్విషయాకృష్టుడై గడియగడియకు నిండారు ॥దు॥

శ్రీవనితా హృత్కుముదాబ్జ, అవాఙ్మనసగోచర ॥దు॥

సకల భూతములయందు నీవైయుండగా మది లేక బోయిన ॥దు॥

చిఱుతప్రాయములనాడే, భజనామృత రసవిహీన కుతర్కుడైన ॥దు॥

పరధనముల కొఱకు నొరుల మది
కరగబలికి కడుపునింప తిరిగినట్టి ॥దు॥

తన మదిని భువిని సౌఖ్యపు జీ -
వనమె యనుచు సదా దినములు గడిపే ॥దు॥

చ. తెలియని నటవిట క్షుద్రులు వనితలు
స్వవశమవుట కుపదిశించి,
సంతసిల్లి స్వరలయంబు లెఱుంగకను
శిలాత్ములై సుభక్తులకు సమానమను ॥దు॥

చ. దృష్టికి సారంబగు లలనా సదనార్భక
సేవామిత ధనాదులను,
దేవాదిదేవ నెరనమ్మితి గాకను
నీ పదాబ్జ భజనంబు మఱచిన ॥దు॥

చ. చక్కని ముఖకమలంబును సదా
నా మదిలో స్మరణ లేకనే
దుర్మదాంధ జనులకోరి పరి -
తాపములచేదగితి నొగిలి
దుర్విషయ దురాసలను రోయలేక,
సతత మపరాధినయి, చపలచిత్తుడనైన ॥దు॥

చ. మానవతను దుర్లభమనుచు నెంచి,
పరమానంద మొందలేక,
మదమత్సర కామలోభమోహులకు
దాసుడయి మోసబోతిగాక,
మొదటి కులజుడగుచు భువిని
శూద్రుల పనులు సల్పుచునుంటినిగాక,
నరాధములను రోయ సారహీన -
మతములను సాధింప తారుమారు ॥దు॥

చ. సతులకు కొన్నాళ్లాస్తికై సుతులకు కొన్నాళ్ళు
ధనతతులకై తిరిగితినయ్య
త్యాగరాజాప్త ఇటువంటి ॥దు॥

3

ఆరభి రాగము ఆదితాళము

ప. సాధించెనే ఓ మనసా ॥సా॥
బోధించిన సన్మార్గ వచనముల

అ.ప. బొంకు జేసి తాబట్టిన పట్టు ॥సా॥

1. సమయానికి తగు మాటలాడెనే
దేవకీ వసుదేవుల నేగించినటు ॥సమ॥

2. రంగేశుడు సద్గంగా జనకుడు,
సంగీత సంప్రదాయకుడు ॥సమ॥

3. గోపీజన మనోరథ మొసంగ లేకనే,
గేలియు జేసేవాడు ॥సమ॥

4. వనితల సదా సొక్కజేయుచును
మ్రొక్కజేసే పరమాత్ముడదియుగాక,
యశోదతనయుడంచు ముదంబునను
ముద్దుబెట్ట నవ్వుచుండు హరి ॥సమ॥

5. పరమ భక్తవత్సలుడు,
సుగుణపారావారుండా జన్మమ
నఘుడీ కలిబాధల దీర్చువాడనుచు
నే హృదంబుజమున జూచుచుండగ ॥సమ॥

6. హరే! రామచంద్ర రఘుకులేశ మృదు సుభాష
శేషశయన పరనారీ సోదరాజ విరాజ తురగ రాజ
రాజనుత నిరామయాప ఘన సరసీరుహదళాక్ష
యనుచు వేడుకొన్నను తాబ్రోవకను. ॥సమ॥

7. శ్రీ వేంకటేశ సుప్రకాశ సర్వోన్నత సజ్జన మానస
నికేతన కనకాంబరధర లసన్మకుట కుండల విరాజిత
హరేయనుచునే పొగడగా త్యాగరాజగేయుడు
మానవేంద్రుడయిన రామచంద్రుడు. ॥సమ॥

8. సద్భక్తులనడతలిట్లనెనే
అమరికగా నాపూజ కొనెనే, అలుగ వద్దనెనే
విముఖులతో జేరబోకుమనెనే, వెతగల్గిన తాళుకొమ్మనెనే
దమశమాది సుఖదాయకుడగు
శ్రీ త్యాగరాజ నుతుడు చెంతరాకనే ॥సమ॥

4

## వరాళి రాగము ఆదితాళము

ప. కన కన రుచిరా కనక వసన నిన్ను ॥క॥

అ.ప. దినమును మనసున చనువున నిన్ను ॥క॥

1. పాలుగారు మోమున శ్రీయ -
పార మహి దనరు నిన్ను ॥క॥

2. కలకలమను ముఖకళగలిగిన సీత
కులుకుచు నోరకన్నులను జూచే నిన్ను ॥క॥

3. బాలార్కాభసుచేల మణిమయ
మాలాలంకృత కంధర సరసిజాక్ష వరక
పోల సురుచిర కిరీటధర సతతంబు మనసారగ ॥క॥

4. సాపత్నీ మాతయౌ సురుచిచే
కర్ణశూల మైనమాట వీనుల
చురుక్కునతాళగ శ్రీహరిని
ధ్యానించి సుఖింపగ లేదా యటు ॥క॥

5. మృగమదలలామ శుభనిటల
వరజటాయు మోక్షఫలద
పవమానసుతుడు నీదు మహిమదెల్ప సీత
తెలిసి వలచి సొక్క లేదారీతి నిన్ను ॥క॥

6. సుఖాస్పద విముఖాంబుధర పవన విదేహమానస
విహారాప్త సురభూజ మానితగుణాంక చిదానంద
ఖగతురంగ ధృతరథాంగ పరమదయాకర
కరుణారస వరుణాలయ భయాపహరా శ్రీరఘుపతే ॥క॥

7. కామించి ప్రేమమీఱ కరముల నీదు పాదకమలముల
బట్టుకొనువాడు సాక్షి రామనామ రసికుడు కైలాస
సదనుడు సాక్షి మఱియు నారద పరాశర శుకశౌనక
పురందర నగజాధరజ ముఖ్యులు సాక్షి గాద
సుందరేశ సుఖకలశాంబుధి వాసాశ్రితులకే ॥క॥

8. సతతము ప్రేమ పూరితుడగు త్యాగరాజ
నుత ముఖజిత కుముదహిత వరద నిన్ను ॥క॥

5

**శ్రీరాగము** **ఆదితాళము**

ప. ఎందరో మహానుభావు లందరికి వందనము ॥ఎం॥

అ.ప. చందురు వర్ణుని యందచందమును హృదయార
విందమునజూచి బ్రహ్మానంద మనుభవించువా ॥ఎం॥

1. సామగానలోల మనసిజలావణ్య ధన్యమూర్ధన్యు ॥ఎం॥

2. మానసవనచర వరసంచారము నిలిపి మూర్తి బాగుగ పొడగనేవా ॥ఎం॥

3. సరగున పాదములకు స్వాంతమను
సరోజమును సమర్పణము సేయువా ॥ఎం॥

4. పతితపావనుడనే పరాత్పరుని గురించి
పరమార్థమగు నిజమార్గముతోను బాడుచును,
సల్లాపముతో స్వరలయాది రాగములను తెలియువా ॥ఎం॥

5. హరిగుణమణులను సరములు గళమున
శోభిల్లు భక్తకోటు లిలలో తెలివితో చెలిమితో
కరుణగల్గి జగమెల్లను సుధాదృష్టిచే బ్రోచువా ॥ఎం॥

6. హొయలుమీఱ నడలుగల్గు సరసుని సదా
కనుల జూచుచును, పులకశరీరులయి యానంద
పయోధినిమగ్నులయి ముదంబునను యశముగలవా ॥ఎం॥

7. పరమభాగవత మౌనివరశశివిభాకర సనకసనందన దిగీశ
సురకింపురుష కనకకశిపుసుత నారద తుంబురు పవనసూను
బాలచంద్రధరశుకసరోజభవభూసురవరులు పరమపావనులు
ఘనులుశాశ్వతులు కమలభవసుఖముసదానుభవులుగాక॥ ॥ఎం॥

8. నీమేను నామ వైభవమ్ములను నీ పరాక్రమ ధైర్యముల శాంత మా
నసము ఈవులను వచన సత్యమును రఘువర నీయెడ సద్భక్తియు
జనించకను దుర్మతములను కల్లజేసినట్టి నీమది
నెఱింగి సతతంబునను గుణభజనానంద కీర్తనము జేయువా ॥ఎం॥

9. భాగవత రామాయణ గీతాది శ్రుతిశాస్త్ర పురాణపు మర్మములన్
శివాదిషణ్మతముల గూఢముల ముప్పది ముక్కోటి సురాంత
రంగముల భావముల నెఱిగి భావరాగలయాది సౌఖ్యము చే
చిరాయువుల్ గలిగి నిరవధిసుఖాత్ములై త్యాగరాజాప్తులైనవా ॥ఎం॥

10. ప్రేమ ముప్పిరి గొను వేళ నామమును దలచేవారు

రామభక్తుడైన త్యాగరాజనుతునికి నిజదాసు ॥లెం॥

## గౌళిపంతు - ఆది

పల్లవి : తెర తీయగ రాద ? నాలోని,
తిరుపతి వెంకట రమణ ! మత్సరమను (తె)

అనుపల్లవి : పరమ పురుష ! ధర్మాది మోక్షముల
బార దోలుచున్నది, నాలోని (తె)

చరణము : 1. మత్స్యము యాకలి ! గొని గాలముచే
మగ్నమైన రీతి నున్నది ;
అచ్చమైన దీప సన్నిధిని మరు
గడ్డబడి చెరచినట్టున్నది (తె)

2. ఇరవొందగ భుజియించు సమయమున
నీగ దగులు రీతి నున్నది,
హరి ధ్యానము జేయు వేళ చిత్తము
అంత్యజు వాడకు బోయినట్టున్నది. (తె)

3. వాగురమని తెలియక మృగ గణములు
వచ్చి తగులు రీతి నున్నది,
వేగమె నీ మతము ననుసరించిన
త్యాగ రాజనుత ! మద మత్సరమను (తె)

## భైరవి - ఆది

పల్లవి : ఉపచారములను చేకొనవయ్య, ఉరగరాజశయన ! (ఉ)

అనుపల్లవి : చపల కోటి నిభాంబరధర ! శ్రీజానకీపతి ! దయజేసి నా (దు)

చరణము : 1. కపట నాటక సూత్ర ధారివై
కామిత ఫలము లొసగెడు రామ,
అపరిమిత నవరత్నముల్పొదిగిన
యపరంజి గొడుగు నీకే తగునయ్య (ఉ)

2. మెరుగు తీగల రీతిని మెరసెడు
కలుకు బంగారు కాడ లమరిన,
శరదిందుద్యుతి సమానమౌ చా ।
మర యుగములు నీకే తగునయ్య (ఉ)

3. జాజులు సంపంగులు మరువవు విర

జాజులు కురువేరు వాసనలను వి -
రాజ మానమగు వ్యజనము, త్యాగ -
రాజ వినుత ! నీకే తగునయ్య (ఉ)

## అమృతవాహిని - ఆది

పల్లవి : శ్రీరామ పాదమా ! నీ కృప - జాలునే; చిత్తమునకు రావే (శ్రీ)

అనుపల్లవి : వారిజభవ సనక సనందన
వాసవాది నారదు లెల్ల పూజించు (శ్రీ)

చరణము : దారిని శిలయై తాపము తాళక
వారము కన్నీరును రాల్చగ,
శూర ! అహల్యను జూచి బ్రోచితివి
యారీతి ధన్యు సేయవే, త్యాగరాజగేయ ! మా (శ్రీ)

## సారమతి - ఆది

పల్లవి : మోక్షముగలదా ? భువిలో జీవ - న్ముక్తులుగాని వారలకు (మో)

అనుపల్లవి : సాక్షాత్కార నీ సద్భక్తి - సంగీత జ్ఞాన విహీనులకు (మో)
చరణము : ప్రాణనల సంయోగము వల్ల
ప్రణవ నాదము సప్తస్వరములై బరగ
వీణా వాదన లోలుడౌ శివమనో
విధ మెఱుగరు, త్యాగరాజ వినుత ! (మో)

## మార్గహిందోళము - దేశాది

పల్లవి : చలమేలరా ? సాకేత రామ ! (చ)

అనుపల్లవి : వలచి భక్తిమార్గముతోను నిన్ను
వర్ణించుచున్న నాతో (చ)

చరణము : ఎందుబోదు నే నేమి సేయుదును ? -
యెచ్చోట నే మొఱ బెట్టుదును ?
దంధనాలతో బ్రొద్దు పోవలెనా ?
తాళజాలరా , త్యాగరాజనుత ! (చ)

## జయంత శ్రీ - దేశాది

పల్లవి : మరుగేలర ? ఓ రాఘవ ! (మ)

అనుపల్లవి : మరుగేల ? చరాచర రూప ! పరా -

త్వర ! సూర్య సుధాకర లోచన ! (మ)

చరణము : అన్ని నీవనుచు నంతరంగమున
తిన్నగ వెదకి - తెలుసుకొంటినయ్య
నిన్నెగాని మదిని నెన్నజాల నొరుల,
నన్ను బ్రోవవయ్యా, త్యాగరాజనుత ! (మ)

## హిందోళము - దేశాది

పల్లవి : మనసులోని మర్మమును దెలుసుకో,
మాన రక్షక! మరకతాంగ ! నా (మ)

అనుపల్లవి : ఇనకులాప్త నీవే గాని వే -
రెవరు లేరయా , ఆనంద హృదయ ! (మ)

చరణము : మునుపు ప్రేమ గల దొరవై, సదా
చనువు నేలినది గొప్పగాదయా,
కనికరంబుతో నీవేళ నా
కరము బట్టు, త్యాగరాజు వినుత! (మ)

## హిందోళము - ఆది

పల్లవి : సామజవరగమన ! సాధుహృ
త్సారసాబ్జపాల ! కాలాతీత ! విఖ్యాత! (సా)

అనుపల్లవి : సామనిగమజ సుధామయ గాన వి
చక్షణ! గుణశీల! దయాలవాల! మాం పాలయ! (సా)

చరణము : వేద శిరో మాతృజ సప్తస్వర
నాదాచల దీప! స్వీకృత
యాదవకుల మురళీ వాదనవి -
నోద ! మోహన కర! త్యాగరాజవందనీయ! (సా)

## ఆభేరి - ఆది

పల్లవి : నగుమోము గనలేని నా జాలిదెలిసి
నన్ను బ్రోవగ రాద ? శ్రీ రఘువర! నీ (న)

అనుపల్లవి : నగరాజధర ! నీదు పరివార మెల్ల -
ఒగి బోధ జేసెడువారలు గారె ? యిటు లుండుదురే ? నీ (న)

చరణము : ఖగరాజు నీ యానతి విని వేగ చనలేదో ?
గగనాని కిలకు బహుదూరం బనినాడో ?

జగమేలే పరమాత్మ ! యెవరితో మొఱలిడుదు ?
వగ చూపకు తాళను నన్నేలుకోరా, త్యాగరాజనుత ! (న)

## ఖరహరప్రియ - త్రిపుట

పల్లవి : పక్కల నిలబడి గొలిచే ముచ్చట బాగ దెల్ప రాద ? (ప)

అనుపల్లవి : చుక్కల రాయని గేరు మోముగల
సుదతి సీతమ్మ సౌమిత్రి రాముని కిరు

చరణము : తనువుచే వందన మొనరించుచున్నారా ?
చనవున నామకీర్తన సేయుచున్నారా ?
మనసునదలచి మైమరచియున్నారా ?
నెనరుంచి త్యాగరాజునితో, హరిహరి ! వీరిరు (ప)

## ఖరహరప్రియ - ఆది

పల్లవి : చక్కని రాజమార్గము లుండగ
సందుల దూర నేల ? ఓ మనస! (చ)

అనుపల్లవి : చిక్కనిపాలు మీగడ యుండగ
చీయను గంగా సాగర మేల ? (చ)

చరణము : కంటికి సుందరతరమగు రూపమే ; ము -
క్కంటి నోట చెలగెడు నామమే ; త్యాగరా -
జింటనే నెలకొన్నది దైవమే, యిటు -
వంటి శ్రీ సాకేతరాముని భక్తియను. (చ)

## ఖరహరప్రియ - రూపకము

పల్లవి : రామ! నీ సమాన మెవరు ? - రఘువంశోద్ధారక! (రా)

అనుపల్లవి : భామా మరువంపు మొలక! - భక్తియను పంజరపు చిలుక (రా)

చరణము : పలుకు పలుకులకు తేనె - లొలుకు మాటలాడు సోద -
రులుగల హరి త్యాగరాజ - కులవిభూష ! మృదు - సుభాష! (రా)

## దేవామృతవర్షిణి - ఆది

పల్లవి : ఎవరని నిర్ణయించేదిరా ! ని - న్నెట్లారాధించేదిరా !? నరవర! (ఎ)

అనుపల్లవి : శివుడవో ? మాధవుడవో ? - కమలభవుడవో ? పరబ్రహ్మవో (ఎ)

చరణము : శివమంత్రమునకు మాజీవము, మా -
ధవ మంత్రమునకు రాజీవము, యీా

వివరము దెలిసిన ఘనులకు మ్రొక్కెద -
వితరణ గుణ ! త్యాగరాజ వినుత ! (ఎ)

## శ్రీ - దేశాది

పల్లవి : నామ కుసుమములచే బూజించెడి
నరజన్మమే జన్మము, మనసా! (నా)

అనుపల్లవి : శ్రీమన్మానస కనక పీఠమ్మున
చెలగజేసికొని వరశివరామ (నా)

చరణము : నాదస్వరమను వర - నవరత్నపు -
వేదికపై, సకల లీలా వి -
నోదుని, పరమాత్ముని, శ్రీరాముని,
పాదములను త్యాగరాజ హృద్భూషణుని (నా)

## మధ్యమావతి - రూపకము

పల్లవి : అలకలల్ల లాడగ గని - యా రాణ్ముని యెటు పొంగెనో ? (అ)

అనుపల్లవి : చెలువు మీరగను మారీచుని మద మణచెడి వేళ (అ)

చరణము : ముని గను సైగదెలిసి శివ - ధనువును విఱిచెడి సమయ -
మున త్యాగరాజ వినుతుని మోమున రంజిల్లు 9అ)

## ఆభోగి - దేశాది

పల్లవి : నన్ను బ్రోవ నీ కింత తామసమా ?
నాపై నేరమేమి బల్కుమా ? (న)

అనుపల్లవి : చిన్ననాడె నీ చెలిమి గలుగ గోరి -
చింతింప లేదా ? శ్రీరామ! (న)

చరణము : నిజదాసవరులగు తమ్ములతో
నీవు బాగ బుట్టగలేదా ?
గజరాజరక్షక ! తనయులను -
కనిపెంచ లేదా ? త్యాగరాజనుత ! (న)

## కళానిధి - దేశాది

పల్లవి : చిన్న నాడె నా చెయి బట్టితివి

అనుపల్లవి : ఎన్నరాని యీడిగము గైగొని
యెంతో నిన్ను, పాలమున సేతునని

చరణము : ఇట్టి వేళ విడనాడుదా మనియో,
యేలు కొందామనియో, యెంచినావో తెలియ,
గుట్టు బ్రోవవే, సుగుణ వారినిధి !
గొప్ప దైవమా! త్యాగరాజనుత! (ఎ)

## మంజరి - ఆది

పల్లవి : పట్టి విడువరాదు నా చెయి బట్టి విడువరాదు నా చెయి (ప)

అనుపల్లవి : పుట్టిననాడే నిజభక్తిని మెడ
గట్టి గుట్టు చెదరక బ్రోచి చెయి (ప)

చరణము : నిత్యానిత్యములను బోధించి, కృత్యాకృత్యములను దెలిపించి,
ప్రత్యేకుడు నీవని కనిపించి, భృత్యుడైన త్యాగరాజు చెయి (ప)

## శ్రీరంజని - రూపకము

పల్లవి : సొగసుగా మృదంగ తాళముల్ జతగూర్చి నిను
సొక్కజేయు ధీరుడెవ్వడో ? (సొ)

అనుపల్లవి : నిగమశిరోర్థము గల్గిన -
నిజ వాక్కులతో, స్వర శుద్ధముతో (రా)

చరణము : యతి విశ్రమ సద్భక్తివిరతి ద్రాక్షరస నవరస యుత -
కృతిచే భజియించు యుక్తి త్యాగరాజుని తరమా ? శ్రీరామా !

## శ్రీరంజని - ఆది

పల్లవి : మారుబల్క కున్నావేమిర ? - మా మనోరమణ ! (మా)

అనుపల్లవి : జారచోర భజన జేసితినా ? సాకేతసదన! (మా)

చరణము : దూరభారమందు, నాహృద - యారవిందమందు, నెలకొన్న
దారి తెలిసి సంతసిల్లినట్టి - త్యాగరాజనుత ! (మా)

## సాళగభైరవి - దేశాది

పల్లవి : సంగీత శాస్త్రజ్ఞానము - సారూప్య సౌఖ్యదమే, మనసా! (సం)

అనుపల్లవి : శృంగార రసాద్యఖిల సార పూ -
రిత రామ కథానందాది యుత (సం)

చరణము : ప్రేమ మీర సుగుణ వాత్సల్యము,

శ్రీమద్రమావరకటాక్షము,
నేమనిష్ఠయశోధనము గల్గనే,
నేర్పు గల్గు త్యాగరాజు నేర్చిన (సం)

## శుద్ధబంగాళ - ఆది

పల్లవి : రామభక్తి సామ్రాజ్య -మేమానవుల కబ్బెనో ? మనసా ! (రా)

అనుపల్లవి : ఆ మానవుల సందర్శన । మత్యంత బ్రహ్మానందమే ; (రా)

చరణము : ఈలాగని వివరింప లేను,
చాలా స్వానుభవ వేద్యమే,
లీలా సృష్ట జగత్త్రయములో
కోలాహల త్యాగరాజు నుతుడగు (రా)

## శుద్ధబంగాళ - ఆది

పల్లవి : తొలి నే జేసిన పూజా ఫలము
దెలిసెను, నా పాలి దైవమా ! (తొ)

అనుపల్లవి : పలు విధముల నే దలచి కరగగ
బలుకక నీవటు నేనిటులనుండగ (తొ)

చరణము : సరివారలలో చౌకగ జేసి, ఉ -
దర పోషకులను పొరుగున జేసి,
హరిదాసరహితపురమున వేసి
దరి జూప కుండగ, త్యాగరాజార్చిత (తొ)

## ఉదయరవిచంద్రిక - దేశాది

పల్లవి : ఎంత నేర్చిన, ఎంత జూచిన, - ఎంత వారలైన, కాంత దాసులె
అనుపల్లవి : సంతతంబు శ్రీకాంతస్వాంత సి -
ద్ధాంతమైన మార్గచింత లేనివా (ఎం)

చరణము : పరహింస పరభామాన్యధన - పరమాన వాపవాద
పరజీవనాదుల కనృతమే - భాషించెదరయ్య, త్యాగరాజనుత!

## ముఖారి - రూపకము

పల్లవి : ఎంతని నే వర్ణింతును ? శబరీ భాగ్య (మెం)

అనుపల్లవి : దాంతుల వర కాంతలు జగ - మంత నిండి యుండగ (నెం)

చరణము : కనులార సేవించి - కమ్మని ఫలముల నొసగి,
తనువు పులకరించి పా - ద యుగములకు మ్రొక్కి
ఇనకుల పతి సముఖంబున - పునరావృత్తి రహిత పద -
మును బొందిన త్యాగరా - జ నుతురాలి పుణ్యంబును (ఎం)

## బృందావనసారంగ - దేశాది

పల్లవి : కమలాప్తకుల కలశాబ్ధి చంద్ర!
కావవయ్య నను కరుణా సముద్ర! (క)

అనుపల్లవి : కమలా కళత్ర! కౌసల్యా సుపుత్ర !
కమనీయ గాత్ర! కామారి మిత్ర! (క)

చరణము : మును దాసుల బ్రోచినదెల్ల చాల
విని నీ చరణాశ్రితుడైతినయ్య,
కనికరంబున నాకభయమియ్యవయ్య,
వనజ లోచన ! శ్రీ త్యాగరాజ వినుత ! (క)

## కానడ - రూపకము

పల్లవి : శ్రీనారద ! నాదసరసీరుహ భృంగ ! శుభాంగ (శ్రీ)

అనుపల్లవి : దీనమాన రక్షక ! జగదీశ ! వేష సంకాశ (శ్రీ)

చరణము : వేద జనిత వర వీణా - వాదన తత్వజ్ఞ!
ఖేదకరత్రితాపరహిత ! ఖేచర వినుత !
యాదవకులజాప్త ! సదా - మోద హృదయ మునివర్య !
శ్రీద త్యాగరాజ వినుత ! శ్రీకర! మాం పాలయ (శ్రీ)

## కన్నడగౌళ - ఆది

పల్లవి : ఓరజూపు జూచేది న్యాయమా ?
ఓ రఘూత్తమా ! నీవంటి వానికి (ఓ)

అనుపల్లవి : నీరజాక్ష ! మును నీ దాసులకు - నీకేటి వాపులు ? దెల్పవే, (ఓ)

చరణము : మాన మించుకైన నీకు తోచలేక పో -
యినవైన మేమి ? పుణ్య రూపమా !
దీన రక్షకా ! శ్రితమానవ సం -
తాన! గాన లోల! త్యాగరాజనుత! (ఓ)

## కాంభోజి - రూపకము

పల్లవి : రామ నన్ను బ్రోవరా - వేమొకో ? లోకాభి (రా)

అనుపల్లవి : చీమలో బ్రహ్మలో - శివకేశవాదులలో,
ప్రేమమీర వెలుగుచుండు - బిరుదు వహించిన సీతా, (రా)

చరణము : మెప్పులకై కన్నతావు - నప్పు బడక విఱ్ఱవీగి
తప్పు పనులు లేక యుండు - త్యాగరాజ వినుత సీతా (రా)

## కాంభోజి - రూపకము

పల్లవి : ఉండేది రాముడొకడు - యూరక జెడిపోకు , మనస (ఉ)

అనుపల్లవి : చండ మార్తాండ మధ్య - మండలమునను చెలంగు (చుం)

చరణము : తామసాది గుణ రహితుడు, - ధర్మాత్ముడు, సర్వసముడు,
క్షేమకరుడు, త్యాగరాజ - చిత్తహితుడు, జగమునిండి (యుం)

## కాంభోజి - దేశాది

పల్లవి : మా జానకి చెట్ట బట్టగ - మహరాజు వైతివి (మా)

అనుపల్లవి : రాజ రాజవర ! రాజీవాక్ష! విను
రావణారి యని రాజిల్లు కీర్తియు (మా)

చరణము : కాన కేగి యాజ్ఞ మీరక మాయా -
కార మునిచి శిఖి చెంతనే యుండి,
దానవుని వెంటనే చని యశోక - తరు మూలనుండి,
వాని మాటలకు గోపగించి కంట - వధియించకయే యుండి,
శ్రీ నాయక ! యశము నీకే గల్గ -
జేయ లేద ? త్యాగరాజ పరిపాల ! (మా)

## సురటి - దేశాది

పల్లవి : గీతార్థము సంగీతానందము - నీ తావున జూడరా, ఓ మనస (గీ)

అనుపల్లవి : సీతాపతి చరణాబ్జము నిడుకొన్న
వాతాత్మజునికి బాగ దెలుసుర (గీ)

చరణము : హరిహర భాస్కర కాలాదికర్మము
లను మతముల మర్మముల నెఱింగిన
హరి హర రూపుడు - హరహయ వినుతుడు,
పర త్యాగరాజ - వరదుడు సుఖిరా (గీ)

## సరస్వతీ మనోహరి - దేశాది

పల్లవి : ఎంత వేడుకొందు రాఘవ ?
పంత మేలరా ? ఓ రాఘవ ! (ఎం)

అనుపల్లవి : చింత దీర్చుట కెంత మోడిర ?
అంతరాత్మ ! నా చెంతరాను, నే (నెం)

చరణము : చిత్తమందు నిను జూచు సౌఖ్యమే
యుత్తమంబనుచు నుప్పొంగుచును,
సత్త మాత్రమా ! చాల నమ్మితిని,
సార్వభౌమ! శ్రీత్యాగరాజనుత ! (ఎం)

## సామ - ఆది

పల్లవి : శాంతము లేక సౌఖ్యము లేదు, - సారస దళ నయన ! (శాం)

అనుపల్లవి : దాంతునికైన వే - దాంతునికైన (శాం)

చరణము : 1. దార సుతులు ధన ధాన్యము లుండిన
సారెకు జప తప సంపద గల్గిన (శాం)

2. ఆగమ శాస్త్రము లన్నియు జదివిన
బాగుగ సకల హృద్భావము దెలిసిన (శాం)

3. యాగాదికర్మము లన్నియు జేసిన
భాగవతు లనుచు బాగుగ బేరైన (శాం)

4. రాజాధిరాజ ! శ్రీరాఘవ! త్యాగ -
రాజ వినుత! సాధు రక్షక! తన కుప - (శాం)

## మోహన - ఆది

పల్లవి : నను పాలింప నడచి వచ్చితివో ? - నా ప్రాణనాథ! (న)

అనుపల్లవి : వనజనయన నీ మోముజూచుట జీ -
వనమని నెనరున - మనసుమర్మముదెలిసి (న)

చరణము : సురపతి నీలమణినిభతనువుతో
నురమున ముత్యపు సరులచయముతో
కరమున శర కోదండ కాంతితో
ధరణి తనయతో, త్యాగరాజార్చిత! (న)

## కాపినారాయణి - దేశాది

పల్లవి : సరససామదాన భేద దండ చతుర!
సాటి దైవమెవ్వరే - బ్రోవవే (స)

అనుపల్లవి : పరమశాంభవాగ్రేసరుండనుచు
బల్కు రావణుడు తెలియలేక పోయె (స)

చరణము : హితవు మాటలెంతో బాగాబల్కితివి
సతముగా నయోధ్య నిత్తునంటివి,
నత సహోదరుని రాజుచేసి, రాక -
హతము జేసితివి , త్యాగరాజ నుత ! (స)

## దేవగాంధారి - ఆది

పల్లవి : క్షీరసాగర శయన! నను - చింతల బెట్ట వలెనా ? రామ! (క్షీ)

అనుపల్లవి : వారణ రాజును బ్రోవను వేగమె
వచ్చినది విన్నానురా , రామ! (క్షీ)

చరణము : నారీమణికి జీర లిచ్చినది - నాడే నే విన్నానురా !
ధీరుడౌ రామదాసుని బంధము - దీర్చినది విన్నానురా,
నీరజాక్షికై నీరధి దాటిన నీ కీర్తిని విన్నానురా !
తారకనామ ! త్యాగరాజనుత ! - దయతో నన్నేలుకోర , రామ!

## పూర్ణచంద్రిక - ఆది

పల్లవి : పలుకవేమి నా దైవమా ? పరులు నవ్వేది న్యాయమా !

అనుపల్లవి : అలుగకారణ మేమిరా ? రామ! నీ
వాడించినటుల యాడిన నాతో (ప)

చరణము : తల్లి తండ్రి భక్తి నొసగి రక్షించిరి
తక్కిన వార లెంతో హింసించిరి,
తెలిసి యూరకుండెడి దెన్నాళ్ళురా ?
దేవాది దేవ! త్యాగరాజునితో (బ)

## మధ్యమావతి - ఆది

పల్లవి : వినాయకుని వలెను బ్రోవవే, నిను
వినా వేల్పు లెవరమ్మ? (వి)

అనుపల్లవి : అనాథరక్షకి! శ్రీ కామాక్షి! సుజనాఘమో -
చని! శంకరి! జనని! (వి)

చరణము : 1. నరాధములకును వరాలొసగనుం -
డరాములై భూసురాది దేవత
లు రాయడిని జెందరాదు , దయ జూ -
డరాదా? కాంచీపురాది నాయకి! (వి)

2. పితామహుడు జనహితార్థమైని -
న్ను తా తెలియ వేడ తాళిమిగల య -
వతార మెత్తె, యికను తామసము సే
య తాళజాలము, నత్తార్తి హారిణి! (వి)

3. పురాన దయచే గిరాలు మాకుని
కి రాజేసి బ్రోచు రాజధరి! త్యా -
గ రాజుని హృదయ సరోజ మేలై -
న సోదరి! పరాశక్తి! నను (వి)

## చిత్తరంజని - ఆది

పల్లవి : నాదతనుమనిశం, శంకరం!
నమామి, మే మనసా శిరసా (నా)

అనుపల్లవి : మోదకర నిగమోత్తమ సామ -
వేదసారం! వారం వారం (నా)

చరణము : సద్యోజాతాదిపంచవక్త్రజ
సరిగమపదనీ వర సప్తస్వర
విద్యాలోలం! విదళిత కాలం!
విమలహృదయ త్యాగరాజ పాలం! (నా)

## హంసధ్వని - దేశాది

పల్లవి : రఘునాయక! నీ పాదయుగ - రాజీవముల నే విడజాల, శ్రీ (ర)

అనుపల్లవి : అఘజాలములఁ బారఁదోలి న -
న్నాదరింప నీవే గతిగాద? శ్రీ (ర)

చరణము : భవ సాగరము దాట లేక నే
బహు గాసి బడి నీ మఱుఁగు జేరితిని
అవనిజాధిపా! శ్రితరక్షక!
ఆనందకర! శ్రీ త్యాగరాజనుత! (ర)

## పూర్ణరవి చంద్రిక - ఆది

పల్లవి : తెలిసి రామచింతనతో నామము - సేయవే, ఓ మనసా! (తె)

అనుపల్లవి : తలపులన్ని నిలిపి నిమిషమైన
తారక రూపుని నిజ తత్వములను (తె)

చరణము : 1. రామా యన చపలాక్షుల పేరు
కామాదులఁ బోరు వారి వేరు
రామా యన బ్రహ్మమునకుఁ బేరు
ఆమానవజననార్తులు దీరు (తె)

2. అర్కమనుచు జిల్లేడు తరు పేరు
మర్కట బుద్ధులెట్లు దీరు?
అర్కుఁడనుచు భాస్కరునికిఁబేరు, కు -
తర్కమనెడి యంధకారము దీరు (తె)

3. అజమనుచును మేషమునకుఁ బేరు
నిజ కోరిక లేలా గేడేరు?
అజుఁడని వాగీశ్వరునికిఁ బేరు
విజయము గల్గును , త్యాగరాజ నుతుని (తె)

## కల్యాణి - రూపకము

పల్లవి : భజన సేయవే , మనసా! పరమ భక్తితో, (భ)

అనుపల్లవి : అజరుద్రాదులకు భూసురాదులకరుదైన రామ (భ)

చరణము : నాద ప్రణవ సప్తస్వర - వేద వర్ణ శాస్త్రపురా -
ణాది చతుష్షష్టి కళల - భేదము గలిగె ,
మోదకరశరీరమెత్తి - ముక్తి మార్గమును దెలియక
వాద తర్క మేల! శ్రీమ - దాది త్యాగరాజ నుతుని (భ)

## బిలహరి - దేశాది

పల్లవి : కనుగొంటిని, శ్రీరాముని నేడు
కనులార కామితంబు దీర (క)

అనుపల్లవి : ఇనకులమందు - యింపుగాను బుట్టిన,
ఇలలోన సీతా - నాయకుని నేడు (క)

చరణము : భరత లక్ష్మ ణ శత్రుఘ్నులు కొలువ,
పవమానసుతుఁడు పాదములఁబట్ట,

ధీరులైన సుగ్రీవ ప్రముఖులు
వినుతి సేయ, త్యాగరాజనుతుని నేడు (క)

## పంతువరాళి - ఆది

పల్లవి : వాడేరా దైవము! మనస! (వా)

అనుపల్లవి : ఆడిన మాటలు తప్ప డనుచును
ఆచంద్రార్కముగ - గీర్తిఁగలిగిన (వా)

చరణము : 1. దండి రక్కసుల మదమణచనునా
ఖండ లాది సురకోట్లకు భూ -
మండల సుజనుల బాలింపను కో -
దండ పాణి రూపముతో వెలసిన (వా)

2. దారి దెలియ లేని యజ్ఞులకు భవ -
నీరధి దాటి మోక్ష మందుటకు
నీరజారి ధరుఁడుపదేశించెడి
తారక నామముతోను వెలసిన (వా)

3. ధాతృవినుతుడైన త్యాగరాజుని -
చేత పూజలంది బాగుగ ప్ర -
ద్యోతనాన్వయమునను జనించి
సీతాపతి యని పేరు గలిగిన (వా)

## మందారి - దేశాది

పల్లవి : పరలోకభయము లేక - భవపాశబద్ధులయ్యెదరు (ప)

అనుపల్లవి : కరి వాజి శృంగారారామ శిబి -
కాదులెల్ల మనకే గలిగెనని (ప)

చరణము : కొన్న కాంతలను కన్న బిడ్డలను
వన్నె చీరలను వాన గుడిసెలను
తిన్నగాగని దైవలోకమని
తన్ను కోళ్లలో, త్యాగరాజనుత! (ప)

## కల్యాణి - ఆది

పల్లవి : ఏతావునరా నిలకడ నీకు?
యెంచి జూడ నగబడవు (ఏ)

అనుపల్లవి : సీతా గౌరీ వాగీశ్వరి యను

శ్రీరూపములందా? గోవిందా? (ఏ)

చరణము : భూకమలార్కానిలనభమందా?
లోక కోటులందా?
శ్రీ కరుఁడగు త్యాగరాజ కరార్చిత
శివ మాధవ బ్రహ్మాదుల యందా? (ఏ)

## తోడి - జంప (మిశ్రగతి)

పల్లవి : మున్ను రావణబాధ నోర్వక విభీ -
షణుఁడు మొఱబెట్టగ ; రామచంద్ర! (ము)

అనుపల్లవి : మన్నింతువనుచు కులబిరుదులను పొగడిన
మాట మరచితావో? శ్రీ రామచంద్ర! (ము)

చరణము : 1. మును వజ్రబాధల నోర్వజాలకను
ఇనజుండు నిను, రామచంద్ర!
కొనియాడ పరితాపమున జూచి
వాని మది కొదవ దీర్చిన రామచంద్ర! (ము)

2. మును హేమకశిపు బాధల సహింపగలేక
మురహరియన, రామచంద్ర!
చనువుతో ప్రహ్లాదు సంతాప -
మును దీర్చి సౌఖ్య మొసగిన రామచంద్ర! (ము)

3. మున్ను నీ మహిమ నే విన్నదే గాని, స -
న్మునివంద్య! శ్రీరామచంద్ర!
పన్నగాధిప శయన! పాలించి నా వెతలు
పరిహరింపవే; రామచంద్ర! (ము)

4. రాజరాజ! విరాజవాహ! రవికులజలధి
రాజ! రాఘవ! రామచంద్ర!ః
రాజీవనేత్ర! భవస్తుత! త్యాగ
రాజవందిత రామచంద్ర! (ము)

## యదుకులకాంభోజి - ఝంప

పల్లవి : శ్రీరామ రఘురామ శృంగార రామయని
చింతించరాదె ఓ మనసా (శ్రీ)

చరణము : 1. తళుకు చెక్కుల ముద్దు బెట్టు కౌసల్య మును
తపమేమి జేసెనో తెలియ

(కౌసల్య మును తపమేమి జేసెనో తెలియ) (శ్రీ)

2. దశరథుడు శ్రీరామ రారయని బిల్వమును
తపమేమి జేసెనో తెలియ
(దశరథుఁడు తపమేమి జెసెనో తెలియ) (శ్రీ)

3. తమిమీర పరిచర్య సేయ సౌమిత్రి మును
తపమేమి జేసెనో తెలియ
(సౌమిత్రి మును తపమేమి జేసెనో తెలియ) (శ్రీ)

4. తనవెంట చన జూచి యుప్పొంగ కౌశికుఁడు
తపమేమి జేసెనో తెలియ
(కౌశికుఁడు తపమేమి జేసెనో తెలియ) (శ్రీ)

5. తాపంబణగి రూపవతి యౌట కహల్య మును
తపమేమి జేసెనో తెలియ
(అహల్య మును తపమేమి జేసెనో తెలియ) (శ్రీ)

6. ధర్మాత్ము కరములు సోక శివచాపంబు
తపమేమి జేసెనో తెలియ
(శివచాపంబు తపమేమి జేసెనో తెలియ) (శ్రీ)

7. తన తనయ నొసగి కనులార గన జనకుండు
తపమేమి జేసెనో తెలియ
(ఆ జనకుండు తపమేమి జేసెనో తెలియ) (శ్రీ)

8. దహరంబు కరగ కరమును బట్ట జానకి
తపమేమి జేసెనో తెలియ
(ఆ జానకి తపమేమి జేసెనో తెలియ) (శ్రీ)

9. త్యాగరాజాప్తయని పొగడ నారద మౌని
తపమేమి జేసెనో తెలియ
(ఆ మౌని తపమేమి జేసెనో తెలియ) (శ్రీ)

## శంకరాభరణము - ఖండలఘువు

పల్లవి : సీతాకల్యాణ వైభోగమే - రామ కల్యాణ వైభోగమే (సీ)

అనుపల్లవి : పవనజ స్తుతి పాత్ర పావన చరిత్ర
రవిసోమ వరనేత్ర రమణీయ గాత్ర (సీ)

చరణము : 1. భక్తజన పరిపాల భరిత శరజాల
భుక్తిముక్తిద లీల భూదేవ పాల (సీ)

Printer friendly pages from Telugu Bhakti Pages http://www.telugubhakti.com
For free downloads join http://groups.yahoo.com/group/TeluguBhaktiPages/

2. పామరాసురభీమ పరిపూర్ణ కామ
శ్యామ జగదభిరామ సాకేతధామ (సీ)

3. సర్వలోకాధార సమరైకధీర
గర్వమానసదూర కనకాగధీర (సీ)

4. నిగమాగమ విహార నిరుపమ శరీర
నగధరాఘవిదార నత లోకాధార (సీ)

5. పరమేశనుత గీత భవజలధి పోత
తరణికుల సంజాత త్యాగరాజనుత (సీ)

## మధ్యమావతి - ఆది

పల్లవి : నగుమోము గలవాని నా మనోహరుని

అనుపల్లవి : జగమేలు శూరుని జానకీ వరుని (న)

చరణము : 1. దేవాదిదేవుని దివ్య సుందరుని
శ్రీ వాసుదేవుని సీతారాఘవుని (న)

2. సుజ్ఞాననిధిని సోమ సూర్య లోచనుని
అజ్ఞాన తమమును అణచు భాస్కరుని (న)

3. నిర్మలాకారుని నిఖిలాఘహరుని
ధర్మాది మోక్షంబు దయచేయు ఘనుని (న)

4. బోధతో పలుమారు పూజించి నే నా -
రాధింతు శ్రీ త్యాగరాజ సన్నుతుని (న)

## జగన్మోహిని - రూపక

పల్లవి : శోభిల్లు సప్తస్వర సుందరుల భజింపవే మనసా

అనుపల్లవి : నాభి హృత్కంఠ రసన నాసాదులయందు (శో)

చరణము : ధర ఋక్సామాదులలో వరగాయత్రీ హృదయమున
సుర భూసుర మానసమున శుభత్యాగ రాజాదులలో (శో)

## శంకరాభరణ - ఆది

పల్లవి : స్వరరాగసుధారసయుత భక్తి
స్వర్గాపవర్గమురా ఓ మనసా (స్వ)

అనుపల్లవి : పరమానందమనే కమలముపై
బక భేకములు చెలఁగేమి మనసా (స్వ)

చరణము :1.మూలాధారజనాద మెఱుఁగుటే
ముదమగు మోక్షమురా
కోలాహల సప్తస్వర గృహముల
గుఱుతే మోక్షమురా ఓ మనసా (స్వ)

2. మద్దెల తాళగతులు తెలియకనె
మర్దించుట సుఖమా
శుద్ధమనసు లేక భజనచేయుట
సూకరవృత్తిరా ఓ మనసా (స్వ)

3. బహుజన్మములకు పైని జ్ఞానియై
బరగుట మోక్షమురా
సహజభక్తితో రాగజ్ఞాన
సహితుఁడు ముక్తుఁడురా ఓ మనసా (స్వ)

4. రజత గిరీశుడు నగజకు దెల్పు స్వ
రార్ణవ మర్మములు
విజయముగల త్యాగరాజుఁడెఱుఁగే
విశ్వసించి దెలుసుకో మనసా (స్వ)

## చారుకేశి - దేశాది

పల్లవి : ఆడమోడి గలదే రామయ్య మాట (లా)

అనుపల్లవి : తోడునీడ నీవె యనుచు భక్తితో
గూడి పాదములఁ బట్టిన మాట (లా)

చరణము : చదువులన్ని దెలిసి శంకరాంశుడై
సదయుడాశుగ సంభవుండు మ్రొక్క
కదలు తమ్ముని బల్కజేసితివి
గాకను త్యాగరాజేపాటి మాట (లా)

## భైరవి - రూపక

పల్లవి : ఉపచారము జేసే వారున్నారని మరవకురా (ఉ)

అనుపల్లవి : కృప కావలెనని నేనీ కీర్తిని పల్కుచునుండగ (ఉ)

చరణము : వాకిటనే పదిలముగా వాతాత్మజుడున్నాడని
శ్రీకరులగు నీ తమ్ములు చేరియున్నారని
ఏకాంతముననను జానకి ఏర్పడియున్నదని
శ్రీకాంత పరులెవ్వరు శ్రీ త్యాగరాజవినుత (ఉ)

## కళావతి - ఆది

పల్లవి : ఎన్నడు చూతునో ఇనకులతిలక ని (న్నె)

అనుపల్లవి : పన్నగశయన భక్తజనావన
పున్నమచందురుబోలు ముఖమ్మును (ఎ)

చరణము : ధరణిజ సౌమిత్రి భరత రిపుఘ్ను వా
నరయూధపతివరుడాంజనేయుడు
కరుణను ఒకరికొకరు వర్ణింప నా
దరణను బిలిచే నిను త్యాగరాజార్చిత (ఎ)

## సారంగ - దేశాది

పల్లవి : ఎంత భాగ్యమో మాపాలఁ గల్గితివి
ఎవరీడు ముజ్జగములలో దన (కెం)

అనుపల్లవి : చెంత జేరి సౌజన్యుడై పలికి
చింత బాగ తొలగించి బ్రోచితివి (ఎం)

చరణము : మున్ను మీ సమీపమున వెలయు స
న్మునులనెల్ల నణిమాది లీలలచేఁ
దిన్నగాను పాలనఁ జేసినటు
నన్ను గాచితివి త్యాగరాజనుత (ఎం)

## తోడి - త్రిపుట

పల్లవి : ఎందుకు దయరాదురా శ్రీరామచంద్ర నీ (కెం)

అనుపల్లవి : సందడియని మఱచితివో ఇందులేవో నీ (కెం)

చరణము : 1. సారెకు దుర్విషయసార మనుభవించు
శ్రీరామ సగమాయె జూచి చూచి
నీరజదళనయన నిర్మలాపఘన (ఎం)

2. తీరని భవనీరధి యాఱడి సైరింప
నేరక భయమందగ బంకపత్ర
నీరువిత మల్లాడగ ఇట్టి ననుజూచి
నీరదాభశరీర నిరుపమ శూర (ఎం)

3. జాగేల ఇది సమయమే గాదు చేసితే
ఏ గతి బలుకవయ్య శ్రీరామ నీ
వేగాని దరిలేదయ్య దీనశరణ్య

త్యాగరాజవినుత తారకచరిత (ఎం)

## తోడి - ఆది

పల్లవి : కొలువమరె గద కోదండపాణి (కొ)

అనుపల్లవి : నలువకుఁ బలుకుల చెలియకు రుక్మిణికి
లలితకు సీతకు లక్ష్మణుని కరుదైన (కొ)

చరణము : 1. వేకువజామున వెలయుచు దంబుర
జేకొని గుణములఁ జెలువొంద బాడుచు
శ్రీకరునికి శ్రితచింతామణికిని
ఆకలిదీరఁ బాలారగింపను జేసే (కొ)

2. వినవయ్య సరిపొద్దు వేళ నాథునికి
చనువున పన్నీట స్నానము గావింప
ఘనునికి దివ్యభోజనమును బెట్టి క
మ్మని విడెమొసగుచు మఱవక సేవించే (కొ)

3. భాగవతులుగూడి బాగుగా ఘననయ
రాగములచే దీపారాధన మొనరించి
వేగమె శ్రీహరి విరులపై బవళించి
జేకొట్టి త్యాగరాజు సుముఖుని లేపే (కొ)

## శుద్ధ సీమంతిని - ఆది

పల్లవి : జానకీరమణ భక్త పారిజాత
పాహి సకలలోక శరణ (జా)

అనుపల్లవి : గానలోల ఘనతమాలనీల
కరుణాలవాల సుగుణశీల (జా)

చరణము : రక్తనళినదళ నయన నృపా
రమణీయానన ముకురకపోల
భక్తహీనజన మదగజజాల
పంచవదన త్యాగరాజపాల (జా)

## శుద్ధసావేరి - ఆది

పల్లవి : దరిని తెలుసుకొంటి త్రిపుర సుం
దరి నిన్నే శరణంటి (ద)

అనుపల్లవి : మరుని జనకుడైన మా దశరథ కు

మారుని సోదరి దయాపరి మోక్ష (ద)

చరణము : 1. అంబ త్రిజగదీశ్వరి ముఖజితు విధు
బింబ యాదిపురమున నెలకొన్న కన
కాంబరి నమ్మినవారి కభీష్ట వ
రంబు లొసఁగు దీనలోకరక్షకి
అంబుజభజీ పురుహూత సనందన
తుంబురు నారదులందరు నీదు ప
దంబునుగోరి సదా నిత్యానం
దాంబుధిలో నోలలాడుచుండే (ద)

2. మహదైశ్వర్య మొసఁగి తొలికర్మ
గహనమును గొట్టి బ్రోచు తల్లి
గుహగజముఖజనని యరుణపంకే
రుహనయన యోగిహృత్సదన
తుహినాచలతనయ నీ చక్కని
మహిమాతిశయమ్ముల చేతను యీ
మహిలో మునిగణములు ప్రకృతి వి
రహితులై నిత్యానందులైన (ద)

3. రాజిత మణిగణభూషిణి మదగజ
రాజగమన లోకశంకరి దనుజ
రాజగురుని వాసరసేవ తన
కే జన్మఫలమో కనుగొంటిని
ఆజన్మము పెద్దలు తమ మదిలో
నీ జపమే ముక్తిమార్గమనుకొన
రాజశేఖరుండగు శ్రీ త్యాగ
రాజమనోహరి గౌరి పరాత్పరి (ద)

## రీతిగౌళ - ఆది

పల్లవి : ద్వైతము సుఖమా అద్వైతము సుఖమా (ద్వై)

అనుపల్లవి : చైతన్యమా విను సర్వసాక్షీ వి
స్తారముగాను దెల్పుము నాతో (ద్వై)

చరణము : గగన పవన తపన భువనాద్యవనిలో
నగధరాజ శివేంద్రాది సురలలో
భగవద్భక్త వరాగ్రేసరులలో
బాగ రమించే త్యాగరాజార్చిత (ద్వై)

## ఆభోగి - ఆది

పల్లవి : మనసునిల్ప శక్తి లేకపోతే
మధురఘంట విరుల పూజేమి జేయును (మ)

అనుపల్లవి : ఘనదుర్మదుఁడై తా మునిగితే
కావేరి మందాకిని యెటు బ్రోచును (మ)

చరణము : సోమిదమ్మ సొగసుగాండ్రఁగోరితే
సోమయాజి స్వర్గార్హుఁడౌనా
కామక్రోధుఁడు తపంబొనర్చితే
గాఁచి రక్షించునో త్యాగరాజనుత (మ)

## నళినికాంతి - దేశాది

పల్లవి : మనవి ఆలకించరాదటే
మర్మమెల్ల దెల్పెదనే మనసా (మ)

అనుపల్లవి : ఘనుడైన శ్రీరామచంద్రుని
కరుణాంతరంగము దెలిసిన నా (మ)

చరణము : కర్మకాండ మదాకృష్టులై భవ
గహనచారులై గాసి జెందగనే
కని మానవ- అవతారుడై
కనిపించినాడే యతడె త్యాగరాజు (మ)

## దేశికతోడి - రూపకము

పల్లవి : రాజు వెడలెఁ జూతాము - రారె కస్తూరి రంగ (రా)

అనుపల్లవి : తేజి నెక్కి సామంతరాజు లూడిగము సేయ
తేజరిల్లు నవరత్నపు - దివ్యభూషణములిడి రంగ (రా)

చరణము : కావేరీ తీరమునను - పావనమగు రంగపురని
శ్రీ వెలయు చిత్రవీధి - లో వేడ్కగ రాగ
సేవను గని సురలు విరులచే - ప్రేమను బూజించగ
భావించి త్యాగరాజు - బాడగ వైభోగరంగ (రా)

## కుంతల వరాళి - ఆది

పల్లవి : శరశర సమరైకశూర శరధిమదవిదార (శ)

అనుపల్లవి : సురరిపు మూల బలరిపు తూల

గిరుల కనలసమమౌ శ్రీరామ (శ)

చరణము : తొలిజేసిన పాపవనకుఠారమా
కలనైన సేయఁగ లేని
బలువిలును విఱిచి వెలసిన శ్రీరఘు
కులవర బ్రోవుము త్యాగరాజనుత (శ)

## సౌరాష్ట్ర - ఆది

పల్లవి : శ్రీగణపతిని సేవించరారే శ్రితమానవులారా (శ్రీ)

అనుపల్లవి : వాగధిపతి సుమపూజలఁ జేకొని
బాగ నటింపుచును వెడలిన (శ్రీ)

చరణము : పనసనారికేళాది జంబూఫలము లారగించి
ఘనతరంబునను మహిపై పదములు
ఘుల్లుఘల్లున నుంచి
అనయము హరిచరణ యుగముల
హృదయాంబుజమున నుంచి
వినయమునను త్యాగరాజ వినుతుని
వివిధగతుల దిత్తళాంగుమని వెడలిన (శ్రీ)

## చక్రవాక - రూపకము

పల్లవి: సుగుణములే చెప్పుకొంటి
సుందర రఘురామ (సు)

అనుపల్లవి : వగ లెఱుంగ లేక ఇటు
వత్తునను చు దురాసచే (సు)

చరణము : స్నానాది సుకర్మంబులు
వేదాధ్యయనంబు లెఱుఁగ
శ్రీనాయక క్షమియించుము
శ్రీత్యాగరాజవినుత (సు)

## పంతువరాళి - ఆది

పల్లవి : శివ శివ శివ యనరాదా? ఓరీ! (శి)

అనుపల్లవి : భవభయబాధల నణచుకోరాదా (శి)

చరణము : 1. కామాదుల దెగకోసి పర
భామల పరుల ధనముల రోసి

Printer friendly pages from Telugu Bhakti Pages http://www.telugubhakti.com
For free downloads join http://groups.yahoo.com/group/TeluguBhaktiPages/

పామరత్వము నెడబాసి, అతి
నీమముతో బిల్వార్చన జేసి (శి)

2. సజ్జనగణముల గాంచి ఓరి
ముజ్జగదీశ్వరులని మతి నెంచి
లజ్జాదుల దొలగించి తన
హృజ్జలజమునను తాపూజించి (శి)

3. ఆగమముల నుతియించి, బహు
బాగులేని భాషలు చాలించి
భాగవతుల పోషించి ఓరి
త్యాగ రాజసన్నుతుడని యెంచి (శి)

## గానమూర్తి - దేశాది

పల్లవి : గానమూర్తే శ్రీకృష్ణవేణు
గానలోల త్రిభువనపాల పాహి (గా)

అనుపల్లవి : మానినీమణి శ్రీరుక్మిణి
మానసాపహార మారజనక దివ్య (గా)

చరణము : నవనీతచోర నందసత్కిశోర
నవమిత్రధీర నరసింహ శూర
నవమేఘతేజ నగజాసహజ
నరకాంతకాజ నత త్యాగరాజ (గా)

## మారువ ధన్యాసి - దేశాది

పల్లవి : మృదుభాషణా నతవిభీషణా (మృ)

అనుపల్లవి : సుదురాస మాన్పగ లేని నను
సుఖచిత్తుగా నెవరు సేతురే (మృ)

చరణము : వరదా నవాంబుద సమీరణ
వరదానఘామర పాలక
దరహాస సద్గుణభూష పరాత్
పర త్యాగరాజ కరార్చిత (మృ)

## కల్యాణి - ఆది

పల్లవి : వాసుదేవ యని వెడలిన యీ దౌవారికుని గనరే (వా)

అనుపల్లవి : వాసవాది సురపూజితుడై

వారిజనయనుని మదిని దలఁచుచును (వా)

చరణము : 1. నీరుకావి ధోవతులను గట్టి
నిటలమునను శ్రీచూర్ణముఁ బెట్టి
నారి వెడలి యీ సభలోఁ జుట్టి
సారెకు బంగరు కోలను బట్టి (వా)

2. మాటి మాటికిని మీసము దువ్వి
మన్మథరూపుఁడు తానని క్రొవ్వి
దాటి దాటి పడుచును తా నివ్వ
ధంబునఁ బలుకుచు పకపక నవ్వి (వా)

3. బాగుమీర నటనము చేయుచును
పతితపావనుని తా వేఁడుచును
రాగ తాళగతులను బాడుచును
త్యాగరాజసన్నుతుని బొగడుచును (వా)

## మాయామాళవ గౌళ - దేశాది

పల్లవి : మేరుసమానధీర ! వరద! రఘు
వీర ! జూతాము రారా మహా (మే)

అనుపల్లవి : సారసార ఒయ్యారపు నడలను
నీరదకాంతిని నీ ఠీవిని మహా (మే)

చరణము : అలకల ముద్దును తిలకపు తీరును
తళుకు జెక్కులచే దనరు నెమ్మోమును
గళమున శోభిల్లు కనక భూషణముల
దళిత దుర్మానవ త్యాగరాజార్చిత (మే)

## దేశ్యతోడి - ఝంపతాళము

పల్లవి : నే పొగడకుంటే నీ కేమి కొదవరా ?
నీ మనసు దెలిసే గదరా ఓ రామ (నే)

అనుపల్లవి : ప్రాపుగల శుక సనక ప్రహ్లాద నారద
పరమేశ రుద్రాది భక్తులర్చింపగ (నే)

చరణము : భుజియింప బెట్ట సతి, బుధులు సామాజికులు
భజియింప సోదరులు పవనసూను -
డజ బిడౌజాది సురలాప్తులైనారు, నీ
రజనయన శ్రీ త్యాగరాజనుత! బాలుడగు (నే)

## హరికాంబోజి - దేశాది శుభపంతు వరాళి

పల్లవి : ఎంతరా నీతనకెంత పోనీ నీ
చెంత విడువజాల శ్రీరామ

అనుపల్లవి : అంతకారి నీచెంత జేరి, హనుమంతుడై కొలువలేదా (ఎం)

చరణము : 1. శేషుడు శివునికి భూషణుడు లక్ష్మణ
వేషియై వెలయ లేదా (ఎం)

2. శిష్టుడు మౌనివరిష్టుడు గొప్ప వ
సిష్టుడు హితుడు గాలేదా (ఎం)

3. నరవర నీకై సురగణము దా
నములై కొలువలేదా (ఎం)

4. ఆగమోక్తమగు నీ గుణములు
శ్రీ త్యాగరాజు బాడగ లేదా (ఎం)

## రీతిగౌళ - రూపకము

పల్లవి : రాగరత్నమాలికలచే
రంజిల్లునట హరిశత (రా)

అనుపల్లవి : బాగ సేవించి సకల
భాగ్య మందుదాము రారే (రా)

చరణము : నైగమషట్ఛాస్త్రపురా -
ణాగమార్ధ సహితమట
యోగివరులు ఆనందము నొందే సన్మార్గమట
భాగవతోత్తములు కూడి పాడే కీర్తనములట
త్యాగరాజు కడతేర తారకమని చేసిన శత (రా)

## తోడి - చాపు

పల్లవి : ఏమి చేసితే నేమి శ్రీరామ
స్వామి కరుణ లేనివా రిలలో (ఏ)

అనుపల్లవి : కామమోహ దాసులై శ్రీరాముని
కట్టు తెలియలేనివా రిలలో (ఏ)

చరణము : 1. హవము చేసితేనేమి కలిమికి పుత్రో
త్సవము కల్గితేనేమి భువిలో

నన్నబీజజనితునికొని యేమి
శివకర శ్రీరాముని దయలేని వా (ఏ)

2. మేడగట్టితేనేమి అందున లాంతర్ జోడుగట్టితేనేమి
చేడియలను మెప్పించ దెలిసితేనేమి
ఈడు లేని రాముని దయలేనివా (రే)

3. ఇమ్ము గలిగితేనేమి, ఇల్లాలికి సొమ్ముబెట్టితేనేమి
కమ్మవిల్తుకేళిని తెలిసితేమి
తమ్మికంటివాని కరుణలేనివారిలలో (ఏ)

4. రాజ్యమేలితేనేమి, బహుజనులలో బూజ్యులైతేనేమి
ఆజ్యప్రవాహముతో నన్నమిడితేనేమి
పూజ్యుడైన రాముని దయలేని వారిలలో (ఏ)

5. గురువు తానైతేనేమి, కంటికి మేను గురువై తోఁచితేనేమి
వరమంత్ర మన్నుల కుపదేశించితేనేమి
వరత్యాగరాజనుతుని దయలేనివా (రే)

## పంతువరాళి - రూపకము

పల్లవి : అప్ప రామభక్తి యెంత గొప్పరా? మా
యప్పరామ భక్తి యెంతో గొప్పరా!

అనుపల్లవి : త్రిప్పటలను దీర్చి కంటిరెప్పవలెను గాచునా? మా (అప్ప)

చరణము : 1. లక్ష్మిదేవి వలచునా లక్ష్మణుండు గొలుచునా
సూక్ష్మబుద్ధిగల భరతుడు చూచి, చూచి సొలసునా మా (అప్ప)

2. శబరి యెంగిలిఇచ్చునా, చంద్రధరుడు మెచ్చునా
అబల స్వయంప్రభకు దైవ, మచల పదవి నిచ్చునా మా (అప్ప)

3. కపి వారిధి దాటునా కలికి రోటగట్టునా
అపరాధి త్యాగరాజు ఆనందము నొందునా మా (అప్ప)

## చక్రవాక - త్రిపుట

పల్లవి : ఎటుల బ్రోతువో తెలియదేకాంతరామయ్య (ఎ)

అనుపల్లవి : కటకట నా చరితము కర్ణకఠోరమయ్యె (ఎ)

చరణము : వట్టిగొడ్డురీతి భక్షించి తిరిగితి
పుట్టులోభులను పొట్టకై పొగడితి
దుష్టులతోఁ గూడి దుష్కృత్యములు సల్పి

రట్టుబడిన త్యాగరాజుని దయతో (ఎ)

## కాంభోజి - ఆది

పల్లవి : ఎవరి మాట విన్నావో రావో యిందులేవో భళిభళి (ఎ)

అనుపల్లవి : అవనిలో నార్షేయ పౌరుషేయమది చోద్యమెఱుఁగ లేనయ్య (ఎ)

చరణము : భక్తపరాధీనుడనుచు పరమ భాగవతుల
వ్యక్తరూపుఁడై పలికిన ముచ్చట యుక్తమనుచునుంటి
శక్తిగల మహాదేవుఁడు నీవని సంతోషమున నుంటి
సత్త చిత్తుడగు త్యాగరాజనుత సత్యసంధు డనుకొంటి నిలలో (ఎ)

## పూర్వికల్యాణి రాగము - రూపకము

పల్లవి : జ్ఞానమొసఁగ రాదా గరుడగమన వాదా (జ్ఞా)

అనుపల్లవి : నీ నామముచే నా మది నిర్మలమైనది (జ్ఞా)

చరణము : పరమాత్ముడు జీవాత్ముడు పదునాలుగు లోకములు
నర కిన్నర కింపురుష నారదాది మునులు
పరిపూర్ణ నిష్కళంక నిరవధి సుఖదాయక
వర త్యాగరాజార్చిత వారము తాననే (జ్ఞా)

## హంసనాద - దేశాది

పల్లవి : బంటురీతి కొలు వీయవయ్య రామ (బం)

అనుపల్లవి : తుంటవింటివాని మొదలైన మదా
దులఁ బట్టి నేలఁ గూలఁ జేయు నిజ (బం)

చరణము : రోమాంచమనే ఘనకంచుకము
రామభక్తుఁడనే ముద్రబిళ్లయు
రామనామ మనే వరఖడ్గ మివి
రాజిల్లునయ్య త్యాగరాజునికే (బం)

## బహుదారి - ఆది

పల్లవి : బ్రోవ భారమా రఘురామ
భువనమెల్ల నీవై నన్నొకని (బ్రో)

అనుపల్లవి : శ్రీ వాసుదేవ అండకోట్లకు
క్షిని ఉంచుకోలేదా నన్ను (బ్రో)

చరణము : కలశాంబుధిలో దయతో నమ
రులకై యదిగాక గోపి
కలకై కొండలెత్తలేదా
కరుణాకర త్యాగరాజుని (బ్రో)

## మలయమారుత - రూపకము

పల్లవి : మనసా ఎటులోర్తునే నా -మనవి చేకొనవే ఓ (మ)

అనుపల్లవి : దినకరకుల భూషణుని -దీనుడవై భజనచేసి
దినము గడుపుమనిన నీవు - వినవదేల గుణవిహీన (మ)

చరణము : కలిలో రాజస తామస గుణములు - గలవారి చెలిమి
కలసిమెలసి తెలుగుచు మఱి - కాలము గడపకనే
సులభముగాఁ కడతేరను - సూచనలను దెలియఁజేయు
ఇలను త్యాగ రాజుమాట - వినవదేల గుణవిహీన (మ)

## శంకరాభరణము - రూపకము

పల్లవి : మనసు స్వాధీనమైన యా ఘనునికి
మరి మంత్రతంత్రము లేల (మ)

అనుపల్లవి : తనను తాను గాదని యెంచువానికి
తపసు చేయనేల దశరథబాల (మ)

చరణము : 1. అన్ని నీవనుచు యెంచినవానికి
యాశ్రమ భేదము లేల
కన్ను గట్టు మాయలని యెంచువానికి
కాంతల భ్రమలేల దశరథబాల (మ)

2. ఆ జన్మము దుర్విషయ రహితునికి గ
తాగత మికయేల
రాజరాజేశ నిరంజన నిరుపమ
రాజవదన త్యాగరాజ వినుత (మ)

## శహన - ఆది

పల్లవి : వందనము రఘునందన సేతు
బంధన భక్తచందన రామ (వం)

చరణము : శ్రీదమా నాతో వాదమా నే
భేదమా ఇది మోదమా రామ (వం)

శ్రీరమా హృచ్చారమా బ్రోవ
భారమా రాయబారమా రామ (వం)

వింటిని నమ్ముకొంటిని శర
ణంటిని రమ్మంటిని రామ (వం)

ఓడను భక్తి వీడను నోరుల
వేడను నీవాడను రామ (వం)

కమ్మని విడె మిమ్మని వరము
కొమ్మని పలుక రమ్మని రామ (వం)

న్యాయమా నీకాదయమా ఇంక
హేయమా మునిగేయమా రామ (వం)

చూడుమీ కాపాడుమీ మమ్ము
పోడిమిగాఁ గూడుమీ రామ (వం)

క్షేమము దివ్యధామము నిత్య
నేమము రామనామము రామ (వం)

వేగరా కరుణాసాగర శ్రీ
త్యాగరాజుని హృదయాకర రామ (వం)

## అఠాణా - రూపకము

పల్లవి : నారద గానలోల నతజనపరిపాల (నా)

అనుపల్లవి : నీరదసమనీల నిరుపమగుణశీల (నా)

చరణము : నీవులేక యే తనువులు నిరతముగా నడచును?
నీవు లేక యే తరువులు నిక్కముగా మొలచును ?
నీవులేక యే వానలు నిత్యముగా మెరియును ?
నీవులేక త్యాగరాజు నీ గుణముల నెటు బాడును ? (నా)

## రవిచంద్రిక - ఆది

పల్లవి : నిరవధిసుఖద నిర్మల రూప నిర్జితముని శాప (ని)

అనుపల్లవి : శరధిబంధన నతసంక్రందన
శంకరాది గీయమాన సాధుజన సుఖదన (ని)

చరణము : మామవమరకత మణినిభ దేహ
భీమపరాక్రమ భీమకరార్చిత
తామసరాజస మానవదూర

త్యాగరాజ వినుత చరణ (ని)

## తోడి - రూపకము

పల్లవి : వెడలెను కోదండ పాణి
అనుజ సౌమిత్రితో గూడి (వె)

అనుపల్లవి : పుడమిలో జనులెల్ల పొగడ
పూజితుడై మునితో గూడి (వె)

చరణము : శిరమున కొండెయు జారా
ఉరమున హారములు మెరయ
కరమున శరచాపములు
ఘనముగ మెరయా
సురుచిర వాద్యములు మ్రోగ
సురు లెల్లను స్తుతిచేయ
వరత్యాగరాజ నుతుడు
వసుధభారమును బాప (వె)

## బంగాళ - దేశాది

పల్లవి : గిరిరాజ సుతా తనయ! సదయ! (గి)

అనుపల్లవి : సురనాథముఖార్చిత పాదయుగ !
పరిపాలయ మా, మిభరాజముఖ ! (గి)

చరణము : గణనాథ! పరాత్పర ! శంకరా -
గమ వారినిధి రజనీకర !
ఫణిరాజకంకణ ! విఘ్ననివా -
రణ ! శాంభవ! శ్రీత్యాగరాజనుత ! (గి)

## వసంతభైరవి - ఆది

పల్లవి : రమారమణ ! భారమా ? నన్ను బ్రోవుమా, శ్రీకర! (ర)

అనుపల్లవి : పుమానుడని గాదని నాతో దె -
ల్పుమా, నరోత్తమా ! సమానరహిత ! (ర)

చరణము : 1. సరి నీ కెవ్వరు దొరకరని గర్వము,
ఆదియుగాక ధరలో జనులు మర్మ -
మెఱిగి నమ్ముకోలేరంటి, ధర్మాది
మోక్ష వరము లొసంగి భక్త -

వరుల గాచిన కీర్తి వింటి, మఱిమఱి
నన్నిందరిలో జెయిబట్టి బ్రోవ
శరణు జొచ్చితినయ్య, దరి నీవను
కొన్నాను, చరణమే గతియంటి (ర)

2. స్మరణ దెలిసి యేలు పరమాత్ముడు
నీవేయన్నాను, పామరులతో
సరిబోయినటుల నీ గోచరములనే
బల్కుకొన్నాను, నా మాటలెల్ల -
కరుణతో నిజము జేయ, వరదా !
దండము లిడినాను, శ్రీరామరామ !
పరమపావననామ ! శరజలోచన! నన్నా -
దరణ జేయుటకింత కరువైన వితమేమి ? (ర)

## తోడి - రూపక

పల్లవి : ఆరగింపవే, పా-లారగింపవే (ఆ)

అనుపల్లవి : (రఘు) వీర జనకజాకరపవిత్రతమౌ వెన్న పా (లా)

చరణము : సారమైన దివ్యాన్నము - షడ్రసయుత భక్షణములు
దారసోదరాదులతో, త్యాగరాజ వినుత ! పా - (లా)

## ధేనుక - దేశాది

పల్లవి : తెలియలేరు రామ! భక్తిమార్గమును (తె)

అనుపల్లవి : ఇలనంతట దిరుగుచును గలువరించెదరు గాని (తె)

చరణము : వేగలేచి నీట మునిగి భూతి బూసి,
వేళ్ల నెంచి వెలికి శ్లాఘనీయులై,
బాగుగ పైక మార్జనలోలు లై -
రేగాని, త్యాగరాజనుత ! (తె)

## ధన్యాసి - ఆది

పల్లవి : సంగీత జ్ఞానము భక్తివినా - సన్మార్గము గలదే ? మనసా (సం)

అనుపల్లవి : భృంగి నటేశ సమీరజ ఘటజ మ -
తంగ నారదాదు లుపాసించు (సం)

చరణము : న్యాయాన్యాయము దెలుసును, జగములు
మాయామయమని దెలుసును, దుర్గుణ

కాయజాది షడ్రిపుల జయించెడి
కార్యము దెలుసును, త్యాగరాజునికి (సం)

## లలిత - రూపకము

పల్లవి : సీతమ్మ మా యమ్మ - శ్రీరాముడు మా తండ్రి (సీ)

అనుపల్లవి : వాతాత్మజ సౌమిత్రి - వైనతేయ రిపు మర్దన
ధాత భరతాదులు సో - దరులు మాకు ; ఓ మనసా ! (సీ)

చరణము : పరమేశ వసిష్ఠ పరా - శర నారద శౌనక శుక
సురపతి గౌతమ లంబో - దర గుహ సనకాదులు
ధర నిజ భాగవతా గ్రే - సరు లెవరో వారెల్లను
వర త్యాగరాజునకి - పరమ బాంధవులు ; మనసా ! (సీ)